నడక వంతెనకు మోక్షమెప్పుడో..?

28వ వార్డు రామ్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన ఫుట్ బ్రిడ్జి



రామ్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన ఫుట్ బ్రిడ్జి



ప్రమాదకర బ్రిడ్జి కింద రజక కుటుంబాలు నిర్వహిస్తున్న దోబీఖానా

- కొత్త వంతెన నిర్మాణానికి జనవరిలో శంకుస్థాపన
- ఐదు నెలలవుతున్నా ప్రారంభం కాని పనులు
- భయం భయంగా రాకపోకలు సాగిస్తున్న స్థానికులు, పాదచారులు
- వంతెన కింద దోబీఖానా వినియోగించాలంటే ఆందోళన

బీచ్‌రోడ్డు: అది ఒక 20 ఏళ్ల నాటి ఫుట్ ఓవర్ బ్రిడ్జి. ప్రధాన రహదారికి దానిపై నుంచే నడుచుకుంటూ వెళ్లాలి. స్థానికులు, పాదచారుల రాకపోకలకు ఎంతో వీలుగా ఉండే ఆ నడక వంతెన ఇప్పుడు పూర్తిగా శిథిలమైంది. దాని కిందే స్థానిక రజక కుటుంబాలు దోబీఖానా ఏర్పాటు చేసుకున్నాయి. ఈ బ్రిడ్జి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రజకులు దోబీ ఘాట్‌లో దుస్తులు ఉతికేందుకు భయపడుతున్నారు. ఇక్కడ ఫుట్ బ్రిడ్జి పునర్నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన కూటమి ప్రభుత్వం, జీవీఎంసీ అధికారులు పనులను ప్రారంభించకుండా గాలికొదిలేశారు. దీంతో తమ ప్రాంతంలోని నడక వంతెనకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్ వాసులు ఎదురు చూస్తున్నారు.

ఐదు నెలల కిందట శంకుస్థాపన

రామ్‌నగర్‌లో కొత్త వంతెన నిర్మాణానికి అనుమతులిచ్చినా.. శంకుస్థాపన జరగకపోవడంతో వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ జీవీఎంసీ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాత బ్రిడ్జిని తొలగించి కొత్త నడక వంతెనతోపాటు దోబీఖానా నిర్మాణాలకు రూ.27 లక్షలు మంజూరు చేశారు. వీటి పనులకు ఈ ఏడాది జనవరి 4న జీవీఎంసీ అధికారులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో శంకుస్థాపన చేయించారు. నేటికీ ఐదు నెలల కాలం దాటినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు..



కొత్త బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి(ఫైల్)

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్త వంతెనకు అనుమతులు

పాత జైలు రోడ్డు నుంచి రామ్‌నగర్ వైపు వెళ్లాలంటే ప్రధాన రహదారి మీదుగా ఈ వంతెన మీద నుంచే నడుచుకుంటూ చేరుకోవాలి. ఈ బ్రిడ్జి శిథిల స్థితికి చేరడంతో భయపడుతూనే ప్రజలు దీనిపై రాకపోకలు సాగించేవారు. స్థానికులు, పాదచారులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను అర్థం చేసుకున్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవీఎంసీ కౌన్సిల్‌లో కొత్త నడక వంతెన నిర్మాణానికి అనుమతులిచ్చింది. అనంతరం సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో శంకుస్థాపన చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఫుట్ బ్రిడ్జి నిర్మాణాన్ని పట్టించుకోలేదు.

పట్టించుకోని అధికారులు

కొత్త వంతెనకు శంకుస్థాపన జరిగి ఐదు నెలలవుతున్నా.. శిథిలమైన బ్రిడ్జిని తొలగించే పనులు కూడా ప్రారంభం కాలేదు. పాత బ్రిడ్జి స్తంభాలు పూర్తిగా బీటలు వారినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. దానిపై నుంచి నడవాలంటే ఏ సమయంలో కూలిపోతుందో తెలియక స్థానికులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. కుల వృత్తిని కొనసాగించేందుకు ప్రాణం అరచేతిలో పెట్టుకుని ఈ వంతెన కింద దుస్తులు శుభ్రం చేయాల్సి వస్తోందని రజకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బీటలు వారిన నడక వంతెన స్తంభాలు

బ్రిడ్జిపై నడవాలంటే భయంగా ఉంది

మేము ప్రధాన రహదారికి వెళ్లేందుకు ఉన్న మార్గం ఈ నడక వంతెన. ఇది నిర్మించి చాలా ఏళ్లయింది. దీంతో బ్రిడ్జి స్తంభాలు బీటలు వారి కూలే స్థితికి చేరాయి. వంతెనపై నుంచి నడవాలంటే చాలా భయంగా ఉంటుంది. కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ఐదు నెలల కిందట ఎమ్మెల్యే శంకుస్థాపన చేసినా.. నేటికీ పనులు ప్రారంభం కాలేదు. తక్షణమే నడక వంతెన పనులు ప్రారంభించాలి.

– అల్సి అప్పలనారాయణ, రామ్‌నగర్

కుల వృత్తి సాగించాలంటే భయపడుతున్నారు

నడక వంతెన కింద ఉన్న దోబీఖానాలో రజకులు దుస్తులు ఉతికేందుకు భయపడుతున్నారు. ఏ క్షణాన బ్రిడ్జి కూలిపోతుందో.. తమ ప్రాణాలకు ఏం జరుగుతుందోనని భయం భయంగా కుల వృత్తి కొనసాగిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే నడక వంతెన పనులు ప్రారంభించి, పూర్తి చేయాలి. కుల వృత్తి చేసుకుంటున్న రజకులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– బొట్ట నాగవెంకట సత్యనారాయణ, స్థానికుడు

క్లుప్తంగా

సూర్యభగవానుడికి పూజలు



శ్రీకృష్ణాపురం వద్ద సూర్యభగవానుడికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన శ్రీకృష్ణాపురం వద్ద సింహాచలం దేవస్థానం నిర్మించిన సూర్యభగవానుడి ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. అధిక సంఖ్యలో భక్తులు ఏడు గుర్రాల రథంపై ఉన్న సూర్యభగవానుడిని దర్శించుకుని, ప్రదర్శనలు, పూజలు చేశారు. ఈ ప్రాంతంలో ఇదొక్కటే ఆలయం కావడంతో ప్రతి ఆదివారం వివిధ చోట్ల నుంచి భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తరలి వచ్చి స్వామికి పూజలు చేస్తున్నారు. అటు సింహాచలం, అడవివరం, పైనాపిల్ కాలనీ నుంచి ఇటు ఆరిలోవ, హనుమంతవాక, విశాలాక్షినగర్ నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో నిర్వాహకులు భక్తులకు మజ్జిగ, తాగునీరు, ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతి ఆదివారం మజ్జిగ, నీరు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా కనకమహాలక్ష్మీ దుర్గమ్మ పండగ



పసుపు కొమ్ముల అలంకరణలో అమ్మవారు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని గొల్లవీధి పరిసర గ్రామాల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మీ దుర్గమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పసుపు కొమ్ముల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకలు మూడు రోజుల పాటు కొనసాగనుండగా.. ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారికి నిర్వహించిన మేలుకొలుపు, సుప్రభాత సేవ, నీలాభిషేకంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సోమవారం తొలేళ్ల పండగ, మంగళవారం ప్రధాన జాతర జరగనున్నాయి. స్థానిక కార్పొరేటర్ గొలగాని మంగవేణి, పోలారావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగ నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని కమిటీ ప్రతినిధులు విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఊరటనిచ్చిన వాన



మద్దిలపాలెం జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

మద్దిలపాలెం: వేసవి తాపంతో ఉక్కిరిబిక్కిరవుతున్న నగరవాసులకు ఆదివారం కురిసిన వాన ఊరటనిచ్చింది. అర్ధగంట పాటు కురిసిన వర్షంతో మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ, పిఠాపురం కాలనీ, ఎంవీపీ కాలనీ తదితర ప్రాంతాలు తడిసిముద్దాయి. కొన్ని చోట్ల రహదారులు వర్షపు నీటితో నిండాయి. వర్షంలో రోడ్లు కనిపించిక వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపివేశారు. బయట పనుల నిమిత్తం వచ్చిన వారు షెల్టర్లను ఆశ్రయించారు.

ఎయిడ్స్ మృతులకు కొవ్వొత్తుల నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

మహారాణిపేట: అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆదివారం ర్యాలీ, సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ప్రారంభించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ మీదుగా రామాటాకీస్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌తో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ మౌనం పాటించారు. ఎయిడ్స్ మృతుల కుటుంబాలకు, ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారికి భరోసా ఇస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

భానుడి భగభగలు.. బోసిపోయిన కూడళ్లు



బీఆర్‌టీఎస్ రహదారిలో నిర్మానుష్యంగా దీన్‌దయాల్‌పురం కూడలి

ఆరిలోవ: వేసవి ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలు తాళలేక జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఆదివారం సెలవు రోజైనప్పటికీ ఉదయం 10 గంటలు దాటిన తర్వాత ప్రజలు బయటకు రావడానికి భయపడ్డారు. దీంతో ఆరిలోవ ప్రాంతంలోని రోడ్లు బోసిపోయాయి. హనుమంతవాక అడవివరం, సింహాచలం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రహదారి నిత్యం వాహన చోదకులతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఐదు లైన్లు అన్నీ వాహనాలతో రద్దీగా మారుతుంటాయి. ఆదివారం మాత్రం ఈ రోడ్డు వాహనాలు తిరగక బోసిపోయింది. అత్యవసర పనులపై బయటకు వెళ్లే కొద్ది మంది ఎండ తీవ్రత తట్టుకోవడానికి తల, ముఖానికి ముసుగులు వేసుకొని ప్రయాణించారు. పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ కూడళ్లన్నీ ఖాళీ అయ్యాయి. సాధారణంగా సెలవు రోజుల్లో ఈ రహదారి సింహాచలం అప్పన్న దర్శనం కోసం వెళ్లే వారితోను, సింహాచలం నుంచి నగరంలోకి పనుల కోసం వచ్చే వారి వాహనాలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీగా ఉంటుంది. ఎండ తీవ్రతతో జనం ఇంటివద్దే గడపాల్సి వస్తోంది.

టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు



త్రినాథ్, రసూల్‌లకు నియామక పత్రాలు అందిస్తున్న అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

మద్దిలపాలెం: న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో విశాఖ నుంచి ఇద్దరికి చోటు లభించిందని ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. మద్దిలపాలెం కృష్ణా కళాశాల సమీపంలోని సాయిసంతోష్ టైలర్స్ షాప్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా నియామకమైన ఇమంది త్రినాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితుడైన షేక్ రసూల్‌కు సత్యనారాయణ నియామక పత్రాలు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా త్రినాథ్, రసూల్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా అసోసియేషన్‌కు చేస్తున్న సేవలను గుర్తించి తమకు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఎప్పటిలాగే టైలర్స్‌కు అందుబాటులో ఉంటు మరిన్ని సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయ సలహాదారులు టి.పుల్లయ్యనాయుడు, విశాఖ జిల్లా కోశాధికారి వై.గౌరీశంకర్, షేక్ ఇమామ్, పి.లక్ష్మీనారాయణ, ఆచారి ముత్యాలరావు, లక్ష్మి, ఇ.భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర ప్రారంభం



శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం



మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

ఎంవీపీకాలనీ: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని పేరిట దేశమంతటా నిర్వహించనున్న పవిత్ర రథయాత్ర ఆదివారం విశాఖలో ఘనంగా మొదలైంది. పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ దేవస్థాన ఆవరణలో రథయాత్రను సంస్థ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు ప్రారంభించారు. అనంతరం శోభాయమానంగా సాగిన యాత్ర పోలమాంబ ఆలయం నుంచి శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ కూడలి మీదుగా ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి ప్రేమ సదన్ మందిరానికి చేరుకుంది. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. 'అందరినీ ప్రేమించండి – అందరినీ సేవించండి' అనే సత్యసాయిబాబా సందేశానికి అనుగుణంగా భక్తులంతా ముందుకు సాగాలన్నారు. ఎదుటి వారికి హాని తలపెట్టకూడదనే భావన నిత్యం అందరిలోను ఉండాలన్నారు. ఐదు ప్రేమ ప్రవాహిని రథాలు దేశవ్యాప్తంగా 600కు పైగా జిల్లాల్లో 3 లక్షల కిలోమీటర్లు ప్రచారం నిర్వహించనున్నాయని తెలిపారు. ప్రేమ, ఐక్యత, సేవా పంచే ఆలయాలుగా నిలుస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తాయన్నారు. నాలుగు రోజుల పాటు విశాఖ జిల్లాలో రథయాత్ర కొనసాగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా సేవా విభాగం కన్వీనర్ ఆర్.ఎ.నాయుడు, సిటీ సమితి కన్వీనర్ సీతారామరాజు పాల్గొన్నారు.

లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రికి రూ.లక్ష విరాళం



డాక్టర్ ఉమామహేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న ప్రసాద్

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని లయన్స్ క్యాన్సర్ హాస్పిటల్ వ్యవస్థాపక ట్రస్టీ, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు ఎ.ఎస్.ఎన్.ప్రసాద్ తన పుట్టిన రోజు సందర్భంగా విరాళం అందజేశారు. లయన్స్ క్యాన్సర్, జనరల్ హాస్పిటల్ అభివృద్ధికి లక్ష రూపాయల చెక్కును ఆదివారం ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావుకు ఆయన అందించారు. డాక్టర్ ఉమామహేశ్వరరావు ప్రసాద్ ఉదార సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. ఆయన తన వందో పుట్టిన రోజును శ్రేయోభిలాషులందరి మధ్య ఆయురారోగ్యాలతో జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

మేడ పైనుంచి జారిపడిన వృద్ధుడి మృతి

ఎంవీపీకాలనీ: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ నుంచి వైద్య చికిత్స కోసం హెచ్‌బీ కాలనీలోని కూతురు ఇంటికి వచ్చి ప్రమాదవశాత్తు మేడపై నుంచి పడిపోయిన నల్లమిల్లి రామారెడ్డి(82) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. వృద్ధాప్యం కారణంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రామారెడ్డి హెచ్‌బీ కాలనీలోని కూతురు ఇంటి వద్ద ఉంటూ చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 17న బాల్కానీలో కుర్చీలో కూర్చుని ఉన్న సమయంలో పైకి లేచే క్రమంలో ప్రమాదవశాత్తు 3వ అంతస్తు నుంచి కిందికి జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతు ఆదివారం మరణించాడు. రామారెడ్డి కుమార్తె మల్లాడి రత్న సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనాథాశ్రమంలో మొల్లి అప్పారావు జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న మొల్లి అప్పారావు, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి



మొల్లి అప్పారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ముచ్చల లక్ష్మీ సురేష్

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ మొల్లి అప్పారావు జన్మదిన వేడుకలను ఆదివారం అనాథాశ్రమంలో జరుపుకున్నారు. సీతమ్మధారలోని కిడ్ పవర్ హోం, బాలికల పాపా హోంలో ఉన్న అనాథ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ అందించారు. అనంతరం 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో మొల్లి అప్పారావు కార్పొరేటర్ మొల్లి లక్ష్మితో కలిసి కేక్ కట్‌చేశారు. తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ హోదాల నాయకులు, వివిధ సంఘాల సభ్యులు, రాజకీయ నాయకులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావుకు 20వ వార్డు కార్పొరేటర్ ముచ్చల లక్ష్మీ సురేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, జ్ఞాపిక అందజేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: శివాజీపాలెంలో కొలువైన చిన పోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్నదానం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 22వ వార్డు అధ్యక్షుడు, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పీతల గోవింద్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ సేవా సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, సభ్యులు, మాజీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



కిశోర్‌కుమార్ మృతదేహం



ప్రమాదంలో నుజ్జయిన స్కూటీ

ఆరిలోవ: జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆరిలోవ ఎస్‌ఐ రాందాసు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలేనికి చెందిన తిప్పాడ కిశోర్‌కుమార్(32) సోఫా సెట్లు కుట్టే పనిచేస్తుంటాడు. అతడు అవివాహితుడు. ఏదో పనిమీద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నగరం నుంచి ఎండాడ వైపు స్కూటీపై బయలుదేరాడు. ఎండాడ పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ తీసుకొని కొంత దూరం వెళ్లిన తర్వాత డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. అదే సమయంలో మధురవాడ వైపు నుంచి నగరంలోకి వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతడిపై నుంచి దూసుకుపోయింది. దీంతో కిశోర్‌కుమార్ తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. అతను నడిపిన స్కూటీ నుజ్జయింది. ప్రమాద విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాందాసు తెలిపారు. సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ప్రాణాలతో చెలగాటం!

తెన్నేటి పార్కు సమీపంలో ఆదివారం సాయంత్రం అత్యంత ప్రమాదకర దృశ్యం ఒకటి పర్యాటకులను భయాందోళనకు గురిచేసింది. ఒక వ్యక్తి తన జీపుపై చిన్నారులను కూర్చోబెట్టి నిర్లక్ష్యంగా ప్రయాణించడం కనిపించింది. జీపు వేగంగా వెళుతుండగా.. పైన ఎలాంటి ఆధారం లేకుండా కూర్చున్న ఆ చిన్నారుల పరిస్థితి చూసి రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అకస్మాత్తుగా బ్రేకులు వేయాల్సి వస్తే లేదా వాహనం అదుపు తప్పితే చిన్నారుల పరిస్థితి ఏమిటని వారు మదనపడ్డారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

జీఎస్టీ ఉద్యోగుల సైకిల్‌థాన్



సైకిల్‌థాన్‌లో పాల్గొన్న జీఎస్టీ ఉద్యోగులు

ఏయూక్యాంపస్: వస్తువులు, సేవల పన్ను(జీఎస్టీ) శాఖ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ ఉద్యోగులు సైకిల్‌థాన్ నిర్వహించారు. 'జీఎస్టీ–పన్నులను సరళీకరించడం, పౌరులను సాధికారపరచడం' నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఫిట్ ఇండియా క్యాంపెయిన్‌తో అనుసంధానం చేస్తూ సైకిల్‌థాన్ నిర్వహించారు. సెంట్రల్ రెవెన్యూ క్వార్టర్స్ నుంచి ఆర్.కె బీచ్ మీదుగా పార్కు హోటల్ కూడలి వరకు ఈ సైకిల్ థాన్ కొనసాగింది. విశాఖ జోన్ కస్టమ్స్ సీజీఎస్టీ, సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ సంజయ్ రాఠీ జెండా ఊపి సైకిల్‌థాన్ ప్రారంభించారు.